తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

12-05-2026

మంగళవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 98

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కలెక్టర్



03

- కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయి
- రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు

కొల్చారం మే 11 ,(సిరి న్యూస్)

కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ వరి కొనుగోలు కేంద్రం, సత్య సాయి రైస్ మిల్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్రై తులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.



## చెరువుల పరిరక్షణకు 900 సీసీటీవీలు

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- ఆక్రమణలు, మట్టి పోయడంపై కఠిన నిఘా
- ఐసీసీసీతో అనుసంధానమైన నిఘా వ్యవస్థ

02

## కులానికో రెసిడెన్షియల్ పాఠశాల



- వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షస్తున్నా
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సిఎం రేవంత్

హైదరాబాద్, మే 11 ,(సిరి న్యూస్):

ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కుల వివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా

మిగతా 2వ పేజీలో..



02

### బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్..

- తక్షణమే విచారణకు ఆదేశం



02

### సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయి వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు

# మోదీ పిలుపు.. దేశవ్యాప్త చర్చ!

- బంగారం కొనొద్దన్న పిలుపు వెనుక భారీ స్కెచ్..
- రూపాయి విలువ పతనాన్ని అడ్డుకునేందుకేనా?

విదేశీ మారక ద్రవ్యం కరిగిపోతుందన్న ఆందోళనే కారణమా?

అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ముందరి కాళ్లకు బంధం వేసే వ్యూహం

చమురు భారం నుంచి దేశాన్ని గట్టెక్కించే మార్గం..

ఇంధన పొదుపుతోనే ఆర్థిక వ్యవస్థకు ఊపిరి!

మళ్ళీ వర్క్ ఫ్రమ్ హోమ్ చర్చ ఎందుకు?

పెట్రో సంక్షోభం ముంచుకొస్తున్న తరుణంలో ముందస్తు హెచ్చరికా?

ధరల నియంత్రణకు వినూత్న సూత్రం..

ఇది కేవలం సలహా మాత్రమేనా?

ముంచుకొస్తున్న ఆర్థిక సంక్షోభానికి ముందస్తు సంకేతమా?

తెలంగాణ బ్యూరో ,(సిరి న్యూస్)

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరమైన ఆర్థిక పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తదనంతర పరిణామాలు మరియు పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు అత్యంత కీలకమైన సందేశాన్ని ఇచ్చారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో ప్రభుత్వం కంటే ప్రజల బాధ్యతే అధికమని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ హఠాత్తుగా దేశ ప్రజలకు చేసిన ఈ విజ్ఞప్తుల వెనుక కేవలం సలహాలు మాత్రమే లేవని, ముంచుకొస్తున్న అంతర్జాతీయ ఆర్థిక గండాల నుంచి దేశాన్ని రక్షించే ఒక పటిష్టమైన 'ముందస్తు రక్షణ వ్యూహం' దాగి ఉందని రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ

మిగతా 2వ పేజీలో..





## రేవంత్ పాలనలో గుడుల విధ్వంసం

- మాజీ మంత్రి హరీశ్ రావు
- 800 ఏళ్ల కాకతీయ శివాలయం ఉద్దేశపూర్వకంగానే కూల్చివేత
- గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి తవ్వకాలు
- పురావస్తు శాఖ ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేయాలి

వరంగల్ ,(సిరి న్యూస్):

"రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగడమే కాదు, గుడుల విధ్వంసం కూడా జరుగుతోంది" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామంలో ధ్వంసానికి గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 800 ఏళ్ల కాకతీయుల నాటి శివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు.

ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు,

మిగతా 2వ పేజీలో..



## కార్మికులకు గౌరవప్రద జీవనం కల్పిస్తాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ సమీక్ష
- జీవన వ్యయానికి అనుగుణంగా కొత్త వేతన విధానంపై చర్చ

హైదరాబాద్ ,(సిరి న్యూస్):

"కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో కనీస వేతనాల సవరణపై సోమవారం

మిగతా 4వ పేజీలో..

## ఖరీఫ్‌కు యూరియా కొరత రాకుండా చర్యలు

- మే చివరి నాటికి 3 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ సిద్ధం చేయాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 11 ,(సిరి న్యూస్):

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా, నిల్వలు మరియు నానో యూరియా వినియోగంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మిగతా 4వ పేజీలో..





## బీజేపీ సభలో ప్రధాని వ్యాఖ్యలు సరికాదు

- ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం తగదు
- మంత్రి పొన్నం ప్రభాకర్
- తెలంగాణకు కేంద్రం ఏం చేసిందో చెప్పాలి
- కాళేశ్వరం అంశంలో బీజేపీపై విమర్శలు
- బండి సంజయ్ కుమారుడి కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలి

హైదరాబాద్ ,(సిరి న్యూస్):

బీజేపీ సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు సరికాదని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా మాట్లాడడం తగదన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రధాని రాష్ట్రానికి వచ్చి భరోసా ఇవ్వాల్సింది పోయి "పెట్రోల్, డీజిల్ వాడొద్దు, బంగారం

మిగతా 3వ పేజీలో..



## దేశ నైపుణ్య రాజధానిగా తెలంగాణ

- యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం : మంత్రి శ్రీధర్ బాబు
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో
- భారీగా పాల్గొన్న ఉద్యోగార్థులు

04

## మనుషులకు వీధి కుక్కల రక్తం?!

- హైదరాబాద్ కేంద్రంగా 'బ్లడ్ మాఫియా' అరాచకం
- రాయదుర్గంలో 'పెట్స్ కేర్' ఆస్పత్రి దారుణాలు బట్టబయలు
- మేకలు, గొర్రెల రక్తం నుంచి ప్లేట్‌లెట్ల సేకరణ
- ప్లాస్మాను రూ. 700 కొని రూ. 3,800 విక్రయిస్తున్న కేటుగాళ్లు
- జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ ఎంట్రీ
- ఈమెయిల్ ఫిర్యాదుతో కదిలిన సర్కారు యంత్రాంగం!



04

### తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- ప్రధాని సభ విజయంతో కేడర్‌లో ఉత్సాహం: ఎంపీ ఈటల

04

# మోదీ పిలుపు.. దేశవ్యాప్త చర్చ!

**మొదటిపేజీ తరువాయి**

మేఘాలు కమ్ముకుని, ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో.. చమురు, బంగారం దిగుమతుల కోసం విదేశీ మారక ద్రవ్యం కరిగిపోకుండా అడ్డుకట్ట వేయడమే ఈ పిలుపులోని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా, వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరణ, ఇంధన పొదుపు వంటి సూచనలు దేశాన్ని పెట్రో సంక్షోభం నుంచి గట్టెక్కించే ప్రయత్నమైతే, 'బంగారం కొనకండి కొనుగోళ్లు ఆపండి' అన్న నినాదం వస్తువుల డిమాండ్‌ను తగ్గించి, మార్కెట్‌లో ధరలను అదుపులోకి తెచ్చే ఒక వినూత్న ఆర్థిక ప్రయోగం. రూపాయి విలువ పతనాన్ని అడ్డుకుంటూనే, సబ్సిడీల భారం తగ్గించి ప్రభుత్వ ఖజానాను భద్రపరచాలనే ఈ 'మాస్టర్ ప్లాన్'.. దేశ ప్రజలను ఒక మానసిక సమరానికి సిద్ధం చేస్తోంది. ఇది కేవలం సామాన్య ప్రజలకు ఇచ్చిన సూచన మాత్రమేనా, లేక రాబోయే ఆర్థిక అనిశ్చితికి బలమైన హెచ్చరికా అన్న కోణంలో ఇప్పుడు దేశవ్యాప్త మేధోమథనం మొదలైంది.

**బంగారం దిగుమతులపై ఆందోళన**

భారతదేశంలో బంగారం అంటే కేవలం ఆభరణం మాత్రమే కాదు, అది ఒక సెంటిమెంట్. అయితే, మన దేశ అవసరాల కోసం ఏటా వేల టన్నుల బంగారాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల మన దేశ విదేశీ మారక నిల్వలు హరించుకుపోతున్నాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. 'శుభకార్యాల పేరుతో భారీగా బంగారం కొని దేశంపై భారం వేయకండి.. కనీసం ఏడాది పాటు ఈ కొనుగోళ్లకు విరామం ఇవ్వండి' అని ఆయన పిలుపునిచ్చారు. బంగారం కొనుగోలు తగ్గితే రూపాయి విలువ పెరిగి, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరపడుతుందని ఆయన వివరించారు.

**ఇంధన పొదుపు..**

**వర్క్ ఫ్రమ్ హోమ్ పునరుద్ధరణ**

ముడి చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఆకాశాన్ని తాకుతున్న తరుణంలో, ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారానే దేశాన్ని ఆర్థికంగా కాపాడుకోగలమని మోదీ పేర్కొన్నారు. కరోనా సమయంలో మనం అనుసరించిన 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం కేవలం ఆరోగ్య రక్షణకే కాదు, ఆర్థిక రక్షణకు కూడా తోడ్పడిందని ఆయన గుర్తు చేశారు. మళ్ళీ ఆన్‌లైన్ సమావేశాలు, వర్చువల్ మీటింగ్‌లను ప్రోత్సహించడం ద్వారా ట్రాఫిక్ తగ్గి, పెట్రోల్ మరియు డీజిల్ వినియోగం గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు కూడా విలాసవంతమైన కార్ల కంటే మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణాకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

**ధరల నియంత్రణకు సూత్రం!**

మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం 'డిమాండ్'. అనవసరమైన వస్తువులను కొనుగోలు చేయడం ఆపితే, వాటి డిమాండ్ తగ్గి, ధరలు వాటంతట అవే తగ్గుతాయని ప్రధాని ఒక సామాన్య ఆర్థిక సూత్రాన్ని ప్రజలకు వివరించారు. అలాగే, విదేశీ బ్రాండ్ల కంటే మన దేశీయ ఉత్పత్తులనే (వోకల్ ఫర్ లోకల్) కొనుగోలు చేయాలని కోరారు. విదేశీ పర్యటనలకు, విదేశాల్లో జరిగే పెళ్లిళ్లకు స్వస్తి చెప్పి, మన దేశంలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ద్వారా దేశ సంపద దేశంలోనే ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**రైతులకు మరియు సామాన్యులకు దిశానిర్దేశం**

వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల దిగుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా సబ్సిడీలు ఇస్తోందని, రైతులు సహజ సిద్ధమైన ఎరువులను వాడటం ద్వారా ఈ భారాన్ని తగ్గించవచ్చని ప్రధాని సూచించారు. విద్యుత్ పొదుపు కోసం సోలార్ పంపులు, ఎల్ఈడీ బల్బుల వాడకాన్ని ఉద్యమంలా చేపట్టాలన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించే కాలం పోయింది.. ఇప్పుడు దేశం కోసం బాధ్యతగా బతికే కాలం వచ్చింది అని మోదీ వ్యాఖ్యానించారు. ప్రతి భారతీయుడు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే, రాబోయే రోజుల్లో భారత్ ప్రపంచంలోనే అత్యున్నత ఆర్థిక శక్తిగా ఎదగడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని ఇచ్చిన ఈ 'త్యాగంబాధ్యత' సందేశం ఇప్పుడు సోషల్ మీడియాలో సైతం భారీగా వైరల్ అవుతోంది.





# జీవో 38 ప్రకారమే వైద్యుల బదిలీలు

- **ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**
- **పారదర్శకంగానే ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ**
- **గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌తో సమావేశం**
- **వైద్య విద్య, సేవల బలోపేతంపై దృష్టి**

**హైదరాబాద్ ,(సిరి న్యూస్):**

"ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 ప్రకారమే వైద్యుల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తాం" అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

గతంలో జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్ల మాదిరిగానే ఈసారి కూడా బదిలీలను పారదర్శకంగా, ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని వైద్యులు కోరారు. టీజీడీఏ కార్యవర్గ సభ్యులకు మినహాయింపు ఇవ్వాలని, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి కూడా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో పనిచేస్తున్న వైద్యులకు హైదరాబాద్ మెడికల్ కాలేజీల్లోకి బదిలీ అవకాశాలు ఇవ్వాలని కోరారు.దీనిపై స్పందించిన మంత్రి, ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే బదిలీలు చేపడతామని తెలిపారు. మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అడ్మినిస్ట్రేషన్, బోధన, క్లినికల్ సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు వైద్యుల సహకారం అవసరమన్నారు.సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, సంగీత సత్యనారాయణ, గౌరవ్ ఉప్పల్, నరేంద్ర కుమార్, అజయ్ కుమార్, నరహరి, లాలూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

**మొదటిపేజీ తరువాయి**

మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన'ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో □ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సవి□క్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమ□ల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల □ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. □ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. 'విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. 'టీచర్లకు ఇది కేవలం ఉద్యోగం కాదు.. అదొక బాధ్యత. 19 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు వి□ చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.





## చెరువుల పరిరక్షణకు 900 సీసీటీవీలు

**హైదరాబాద్ ,(సిరి న్యూస్):**

నగరంలోని చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా భారీ స్థాయిలో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. చెరువులను మట్టితో నింపడం, ఆక్రమణలు, నిర్మాణ వ్యర్థాలు వేయడం వంటి అక్రమాలను అరికట్టేందుకు 900 సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సోమవారం ఈ ఆధునిక నిఘా వ్యవస్థను ఆయన ప్రారంభించారు.

చెరువుల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమేరాలను నేరుగా హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానం చేశారు. దీంతో చెరువుల వద్ద జరిగే ప్రతి కదలికను కంట్రోల్ రూమ్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. ఎవరైనా మట్టి పోయడం, ఆక్రమణలకు ప్రయత్నించడం, వ్యర్థాలు వేయడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేశారు.

ఇప్పటికే చెరువుల వద్ద లేక్ ప్రొటెక్షన్ బృందాలు పనిచేస్తుండగా, ఇప్పుడు సీసీటీవీ నిఘా అందుబాటులోకి రావడంతో పర్యవేక్షణ మరింత పటిష్టమైందని అధికారులు తెలిపారు. మట్టి తీసుకువచ్చే వాహనాల వివరాలను కూడా కెమేరాల ద్వారా గుర్తించి అక్కడి బృందాలను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ఈ నిఘా వ్యవస్థను బంజారా హిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు.

## బండి భగీరథ్ కేసుపై సీఎం సీరియస్..

**హైదరాబాద్, మే 11 ,(సిరి న్యూస్):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది..

## సనత్‌నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయి వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దాలి

- **ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు**

**హైదరాబాద్, మే 11 ,(సిరి న్యూస్)**

సనత్‌నగర్ టిమ్స్‌లో పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా అన్ని ఏర్పాట్లు పటిష్టం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో సనత్‌నగర్ టిమ్స్ ట్రయల్ రన్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ట్రయల్ రన్‌లో భాగంగా ప్రస్తుతం 22 విభాగాల్లో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయని, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే తదితర ఆధునిక యంత్రాల ఏర్పాటు పూర్తయిందని వివరించారు.ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ, వార్డులు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. సనత్‌నగర్ టిమ్స్‌ను కార్డియాక్ కేర్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పూర్తై ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. వైద్య సేవలతో పాటు పారిశుధ్యం, భద్రత వంటి నాన్ మెడికల్ సేవలు కూడా సమర్థంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. రోగులు, అటెండెంట్లకు భోజన సదుపాయం, అటెండెంట్ల కోసం ధర్మశాల ఏర్పాట్లు చేయాలని సూచించారు.



## రేవంత్ పాలనలో గుడుల విధ్వంసం

**మొదటిపేజీ తరువాయి**

కాకతీయ గణపతిదేవుడు నిర్మించిన చారిత్రక శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగానే కూల్చేశారని విమర్శించారు. ఆలయ రక్షణ కోసం ఉన్న మట్టి ఆనకట్టను తొలగించి గర్భగుడిని ధ్వంసం చేశారని ఆరోపించారు.

అర్ధరాత్రి సమయంలో 24 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరపడం గుప్త నిధుల కోసమేనని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం పగటి పూట పనులు చేయవచ్చని, రాత్రివేళ తవ్వకాలు ఎందుకు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పురావస్తు శాఖ ఫిర్యాదు ఆధారంగా వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ పర్యటనలో ఎర్రబెల్లి దయాకర్ రావు, పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## సంపాదకీయం

# రాజకీయ సమరం.. అభివృద్ధి మంత్రం !

ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా హైదరాబాద్ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. ఒకవైపు వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తూనే, మరోవైపు రాజకీయ వ్యూహాలతో ప్రత్యర్థి పార్టీలపై పదునైన విమర్శలు సంధించడం ద్వారా రాష్ట్రంలో రాబోయే రాజకీయ పోరుకు ఆయన నాంది పలికారు. ముఖ్యంగా మోదీ తన పర్యటనలో అధికారిక కార్యక్రమాలతో పాటు వ్యక్తిగత పలకరింపులకు ప్రాధాన్యతనివ్వడం చర్చనీయాంశమైంది. మోదీ నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసాలను సందర్శించడం కూటమి బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా వేసిన అడుగుగా కనిపిస్తోంది. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాకుండా, దక్షిణ భారత దేశంలో ఎన్డీయే పట్టును పెంచుకునే వ్యూహంలో భాగమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణను మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో సుమారు రూ.9,400 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. వరంగల్‌లో దేశంలోనే తొలిసారిగా పూర్తిస్థాయిలో పనిచేసే పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్, సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా వంటివి ప్రధానమైనవి. కాజీపేట–విజయవాడ రైల్వే లైన్, హైటెక్ సిటీలో అధునాతన మల్టీ–స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించడం ద్వారా మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్రం తన చిత్తశుద్ధిని చాటుకుంది. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో మోదీ చేసిన ప్రసంగం పూర్తిస్థాయి రాజకీయ ప్రచారాన్ని తలపించింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విరుచుకుపడుతూ, అవి కేవలం కుటుంబ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ తరహాలోనే తెలంగాణ ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నారని, రాష్ట్రంలో 'డబుల్ ఇంజిన్ సర్కార్' రావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాతీయంగా ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో, ఇంధన పొదుపు, అనవసర ఖర్చుల నియంత్రణపై మోదీ చేసిన విజ్ఞప్తి ప్రాధాన్యత సంతరించుకుంది. పెట్రోల్, డీజిల్, బంగారం కొనుగోళ్లపై నియంత్రణ పాటించాలని ఆయన ప్రజలను కోరారు. అభివృద్ధి, రాజకీయాలు జోడు గుర్రాల వలె సాగిన ప్రధాని పర్యటన, తెలంగాణలో రాబోయే ఎన్నికలకు గట్టి పునాది వేసింది. మిత్రపక్షాలతో మైత్రిని కొనసాగిస్తూనే, సొంతంగా ఎదిగేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా ఉన్నాయి.

# కలెక్టర్‌పై దుష్ప్రచారం తగదు

## బీఆర్ఎస్ నేతల అగ్రహం



- నిజాయితీగా పనిచేస్తున్న జిల్లా కలెక్టర్‌పై కక్షసాధింపు ఆరోపణలు సరికావు.
- నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు.
- ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే అధికారిని టార్గెట్ చేస్తున్నారు.
- అసత్య ఆరోపణలతో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం దెబ్బతీయొద్దని హెచ్చరిక.
- సోషల్ మీడియా వేదికగా విష ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.
- కలెక్టర మ్మకు అండగా
- బిఆర్ఎస్ నాయకులు చౌదరి సుప్రభాత్ రావు.

**రామాయంపేట, మే11 (సిరి న్యూస్) మెదక్**

జిల్లాలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ పై కొందరు రాజకీయ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు చౌదరి సుప్రభాత్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలు నిర్వహించడం దారుణమని మండిపడ్డారు.సోమవారం రామాయంపేట లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజల మధ్య మంచి పేరు సంపాదించుకున్న అధికారులను అపకీర్తి పాల్జేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.జిల్లాలో సాగు, ధాన్యం కొనుగోలు, తాగునీటి సమస్యలు, రెవెన్యూ అంశాలు, ప్రజావాణి కార్యక్రమాలు వంటి అనేక అంశాల్లో కలెక్టర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ స్థాయికి వెళ్లి పరిస్థితులను పరిశీలిస్తూ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తున్న అధికారిపై రాజకీయ విమర్శలు చేయడం తగదన్నారు.కొంతమంది నాయకులు ప్రజల్లో ప్రాధాన్యత కోల్పోయి రాజకీయంగా లాభపడేందుకు అధికారులపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో అసత్య కథనాలు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రభుత్వంపై నేరుగా విమర్శలు చేయలేక అధికారులను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు.ఒక మహిళా అధికారిణిపై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్న అధికారులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విధులు నిర్వర్తిస్తున్న అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం అనైతికమని అభిప్రాయపడ్డారు.కొన్ని సోషల్ మీడియా ఖాతాల ద్వారా కావాలనే తప్పుడు ప్రచారం నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు పెట్టి గందరగోళం సృష్టిస్తున్నారని చెప్పారు. ఇటువంటి చర్యలపై పోలీసులు, సైబర్ క్రైమ్ విభాగం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక కొందరు నాయకులు ఈ తరహా ఆరోపణలకు దిగుతున్నారని అయన పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, అందుకే అసత్య ప్రచారంతో మభ్యపెట్టాలని చూస్తున్నాయని విమర్శించారు.రాజకీయ ఆరోపణలు, సోషల్ మీడియా ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. జిల్లాలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా చూసి ప్రజలే నిజానిజాలు అర్థం చేసుకోవాలని అన్నారు. అధికారుల పనితీరును రాజకీయ కోణంలో కాకుండా ప్రజాసేవ కోణంలో చూడాలని విజ్ఞప్తి చేశారు.కలెక్టర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ అధికారులను బెదిరించేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పని చేసే అధికారులకు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఎస్కే హైమద్, అసనొద్దీన్, మద్దెల రమేష్, వినయ్ సాగర్, దోమకొండ యాదగిరి,దోమకొండ వంశీ, రొయ్యల నవీన్, అల్లాడి వెంకటి, డాకి పునీత్, సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**కొండాపూర్ మే 11(సిరి న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధులను ఎప్పటికప్పుడు మంజురు చేయడంతో నిరుపేదల ఆరోగ్యాలకు వరప్రద్దాయినిగా చేకూరుతుందని టిజిఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్ మండలం వివిధ గ్రామాలకు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు రూ.6 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను సంగారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో టీజీఐఐసీ చైర్పర్సన్ అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన, నిరుపేద తరగతుల సంక్షమాలను ఆర్థికంగా, రాజకీయంగా నిలదొక్కెందుకు అనేక పథకాలు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా నియోజవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు నూతన పరిశ్రమలను స్థాపనలకు శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రులు, మాజీ ఎమ్మెల్యే టిపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతో పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా అభివృద్ధికి అంకితభావంతో సమగ్ర పాలనపై దృష్టి పెట్టారన్నారు. నమ్మికున్న ప్రజలకు ఆపదోస్తే.. అప్పన్నహస్తంగా ఆర్థికంగా ఆదుకునే గొప్ప నేతగా రాష్ట్రంలోనే జగ్గారెడ్డి పేరు పేరు ప్రఖ్యాతులు సంపాదించారన్నారు. ఈ చెక్కుల పంపిణీలో కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్పర్సన్ ప్రభు, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కొండాపూర్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి,నాయకులు వెంకటేశం గౌడ్, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు..

- 30 రోజుల్లోగా పరిష్కారం చూపాల్సిందే
- ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- మ్యాన్‌హోల్స్ వెంటనే మూసివేయాలని అధికారులకు
- జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి పోటెత్తిన వినతులు..

**సంగారెడ్డి, మే 11 (సిరి న్యూస్):**



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితులతో మాట్లాడి, ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అప్పటికప్పుడే కీలక సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ఇవి అత్యంత ప్రమాదకరమని, ఏవైనా ప్రమాదాలు జరగకముందే మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో వాటిని వెంటనే మూసివేయాలని స్పష్టం చేశారు. అలాగే, ఆర్ అండ్ బి రోడ్ల డివైడర్లపై ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, పాత ప్రకటన బోర్డులను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని సూచించారు. సింగూర్ డ్యాం సందర్శనకు వచ్చే పర్యాటకుల భద్రత దృష్ట్యా అక్కడ బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డులు లేకపోవడాన్ని కలెక్టర్ గుర్తించారు. తక్షణమే అక్కడ రక్షణ ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతగా స్వీకరించి, గరిష్టంగా 30 రోజులలోపు వాటిని పరిష్కరించాలని, జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని వివిధ డివిజన్ల నుంచి మొత్తం 108 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కలెక్టర్





- కొనుగోలుకు సంబంధించిన అ న్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయి
- రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు

**కొల్చారం మే 11 ,(సిరి న్యూస్)**

కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ వరి కొనుగోలు కేంద్రం, సత్య సాయి రైస్ మిల్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు, అన్లోడింగ్ లో సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు సమన్వయంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు.సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కొల్చారం మండల కేంద్రంలోని ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్ని బ్యాగ్ లు సరిపడా పంపిస్తున్నారా లేదా?కేంద్రాలకు కేటాయించిన లారీలు వస్తున్నాయా? లేదా? అలాగే నమోదు అయిన ఓపీఎంఎస్ వివరాల గురించి కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 13 లారీల ధాన్యం ఈ సెంటర్ నుండి సత్య సాయి రైస్ మిల్లుకు తరలించడం జరిగిందని ఈ సెంటర్లో హమాలీల కొరత లేదని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సివిల్ సప్లై అధికారులు కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ నాగూరి మనోహర్ సొసైటీ సీఈఓ కృష్ణ అధికారులు రైతులు కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.







# ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలు పంపిణీ!

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.!!

**శివంపేట. మే 11 ( సిరి న్యూస్ )**



శివంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల ఇందిరమ్మ ఇల్లు 83 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మండల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు లబ్ధిదారుల సమక్షంలో మంజూరు పత్రాలను ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత నాది అని అన్నారు. ప్రభుత్వ అధికారుల నిబంధన మేరకే ఇంటిని నిర్మించుకోవాలని లేనిపక్షంలో బిల్లులు ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివంపేట మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, హౌసింగ్ డిఈ ప్రభు, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, శివంపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాజా రమణ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, స్థానిక శివంపేట సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ సభలో ప్రధాని వ్యాఖ్యలు సరికాదు

**మొదటిపేజీ తరువాయి**

కొనొద్దు" వంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు.
గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మెట్రో రైలు, ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు వంటి అంశాల్లో తెలంగాణకు వివక్ష జరుగుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా బీజేపీ నేతలు ముందుకు రావడం లేదని విమర్శించారు.
కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలని, దర్యాప్తుపై ఒత్తిళ్లు తీసుకురావొద్దని హెచ్చరించారు. ప్రజలను విభజించే రాజకీయాల కంటే అందరికీ సమాన హక్కులు కల్పించే రాజకీయాలు అవసరమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# కార్మికులకు గౌరవప్రద జీవనం కల్పిస్తాం

**మొదటిపేజీ తరువాయి**

మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.
పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం దృష్ట్యా కార్మికుల వేతనాలను కాలానుగుణంగా సవరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వేతనాల నిర్ణయంలో కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, గృహ వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు.
దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతన విధానాలను పరిశీలిస్తున్నామని, తెలంగాణకు అనువైన శాస్త్రీయ విధానాన్ని రూపొందించనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.
కార్మిక సంక్షేమం కేవలం వేతనాల పెంపుతో మాత్రమే పరిమితం కాదని, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, ఉపాధి స్థిరత్వంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. త్వరలో కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, నిపుణుల అభిప్రాయాలు తీసుకుని తుది నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.
సమావేశంలో మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు యూరియా కొరత రాకుండా చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

ఎరువుల కంపెనీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మే నెలాఖరు నాటికి కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రానికి ఖరీఫ్ కోసం 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని కేంద్రాన్ని కోరగా, 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఏప్రిల్‌లో కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 1.53 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందాయని వెల్లడించారు.రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువులను ఎమ్మార్పి కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, కంపెనీలు కూడా ప్రచార కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని కేంద్రం కొత్త యాప్‌ను రూపొందించిందని, మే 21 నుంచి దేశవ్యాప్తంగా రెండు జిల్లాల చొప్పున ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలను ఎంపిక చేసినట్లు చెప్పారు.ః సేంద్రియ వ్యవసాయానికి కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని మంత్రి కోరారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను మాత్రమే వినియోగించాలని సూచించారు.

# ఔషధ రవాణాలో రైల్వే కీలక ముందడుగు

- 'ఔషధి ఎక్స్‌ప్రెస్' ప్రారంభంపై మంత్రి కిషన్‌రెడ్డి హర్షం



**హైదరాబాద్, మే 11 ,(సిరి న్యూస్):**

ప్రయాణికుల సేవలు, వస్తు రవాణాతోపాటు అత్యాధునిక సేవలు కల్పించడంలో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో దూసుకుపోతున్న భారతీయ రైల్వే ఇప్పుడు ఔషధాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీఎం గతిశక్తి కార్యక్రమానికి కొనసాగింపుగా ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియా అయిన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్(జేఎన్‌పీటీ)కు ఔషధాలను సరఫరా చేసేందుకు ఈనెల 2న ఔషధి ఎక్స్‌ప్రెస్ పేరుతో దేశంలోనే తొలి ప్రత్యేక ఫార్మసీ రైలును ప్రారంభించడం పట్ల కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మొదటి రెగ్యులర్ 'ఔషధి ఎక్స్‌ప్రెస'ను తెలంగాణకు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు ధన్యవాదములు తెలియజేశారు. ఫార్మా కంపెనీలకు కేంద్రమైన హైదరాబాద్‌లో తయారయ్యే ఫార్మా ఉత్పత్తులను దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించడంతోపాటు అంతర్జాతీయంగా పంపిణీ చేసేందుకు ముంబై సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్టుకు తరలించడం తప్పనిసరి. అందుకే హైదరాబాద్‌ను, జేఎన్‌పీను అనుసంధానిస్తూ ఈ ప్రత్యేక రీఫర్ రైలు (కోల్డ్ స్టోరేజ్ వసతి గల రైలు)ను ప్రారంభించడం హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు ఎంతో మేలు కలగ□గనుంది. దీంతోపాటు దేశవ్యాప్తంగా, వివిధ దేశాలకు సరైన సమయంలో ఔషధాలను చేరవేసేందుకు వీలు కలుగుతుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా, పటాన్‌చెరులోని ఫార్మా జోన్, ముచ్చర్లలోని ఫ్యూచర్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే ఫార్మా ప్రొడక్ట్స్ సరఫరాకు ఈ రైలు చాలా కీలకం కానుంది. దేశవ్యాప్తంగా తక్కువ ఖర్చులో వస్తు రవాణా జరగడంతోపాటు సుస్థిరమైన, పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం రూ.100 లక్షల కోట్ల వ్యయంతో పీఎం గతిశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ప్రత్యేక 'ఔషధి ఎక్స్‌ప్రెస' సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వరంగ సంస్థ అయిన కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (కాంకర్) ఆధ్వర్యంలో నడుస్తున్న సనత్‌నగర్‌లోని ఇన్ ల్యాండ్ కంటైనర్ డిపో (ఐసీడీ) నుండి ఈ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. 'ఔషధి ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేసిన ఈ రెఫ్రిజిరేటర్ రైలు ద్వారా లైఫ్ సేవింగ్ మందులతో పాటు అవసరమైన ఇతర సరకులను కూడా రవాణా చేయనున్నారు. హైదరాబాద్ నుంచి జేఎన్‌పీటీ వరకు ప్రయాణిస్తున్న సమయంలో కంటిన్యూయస్ రిఫ్రిజిరేషన్ ఉండేందుకు డీజిల్ పవర్ ప్యాక్‌లతో కూడిన అధునాతన రీఫర్ కంటైనర్లను వినియోగిస్తున్నారు. ఇది మన కోల్డ్‌చైన్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతోపాటు ఫార్మాసూటికల్స్ సప్లయ్ చైన్ కెపాసిటీని పెంచేందుకు కీలకమైన ముందడుగు కానుంది. ప్రస్తుతానికి వారానికి ఒకసారి నడుస్తున్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను డిమాండ్, వాణిజ్య వర్గాల అవసరాలకు అనుగుణంగా వారానికి రెండుసార్లు నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా ఇన్నొవేషన్ బేస్డ్ సొల్యూషన్స్ తీసుకురావడంలో మోదీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త అవకాశాలకు ప్రోత్సాహాన్ని అందిస్తోందని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

# మనుషులకు వీధి కుక్కల రక్తం?!

**తెలంగాణ బ్యూరో,**

రక్తం ఇప్పుడు మనిషికైనా జంతువులకైనా అత్యవసరం .సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో వైద్య విప్లవం మూలంగా ఒక వైపు రోగాలకు మరో వైపు చికిత్సకు సైతం భారత దేశమే ప్రధాన కేంద్రంగా మారింది. ఇప్పుడు సగటున 50 శాతము వ్యాధిగ్రస్తుల్లో రక్తహీనత ప్రధాన సమస్య అందులో కొన్ని గ్రూపుల రక్తం అస్సలు దొరకదు. అందుకే రక్తాన్ని నిల్వవుంచే కేంద్రాలు లెక్కలేనన్ని పుట్టుకొచ్చాయి. చాలావరకు స్వచ్ఛందంగా సేవ చేస్తున్నామనే ముసుగులో రక్తం పిండి అమ్మేస్తున్నారు. కానీ వందల సంఖ్యలో బ్లడ్ బ్యాంక్స్ ఉన్నా ఇంకా రక్తం కొరత మాత్రం అంతే ఉంది.సామజిక మాధ్యమాల్లో సమస్య ఇది అని చెబితే కొంత మేర రక్తం దానం ఇచ్చే వారు ఉన్నారు . ఐనప్పటికీ సామాన్యులకు రక్తం అందుబాటులో లేని పరిస్థితి . ఇలాంటి పరిస్థితులను వ్యాపారంగా మార్చుకునేందుకు హైదరాబాద్ చెందిన ఒక ఆసుపత్రి పెద్ద ప్లాన్ వేసింది. ప్రస్తుతం మనుషుల రక్తంతోనే వ్యాపారం చేస్తున్న కొందరిని మించి వీధి కుక్కలు, మేకలు, గొర్రెల రక్తంతో దందాకు తెర లేపారు. మూగజీవాల రక్తం నుంచి ప్లేట్‌లెట్లను తీసి మనుషులకు ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటమాడే మాఫియా గుట్టురట్టయిన కొద్ది రోజుల్లోనే.. పెట్స్ యజమానులను బెదిరించి కుక్కల రక్తం తీసి విక్రయిస్తున్న ముఠా పట్టుబడింది. ఇటీవల ప్లాస్మాను సేకరించి అమ్ముకున్న ప్రయివేటు బ్లడ్ బ్యాంకుల లైసెన్స్‌లు రద్దు చేయగా.. ఈ ఘటనతో పలు ఆస్పత్రులపై కూడా అధికారులు నిఘా పెట్టారు.

**ఆస్పత్రి సీజ్**

రాయదుర్గంలో ఉన్న పెట్స్‌కేర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మూగజీవాల రక్తంతో సాగిస్తున్న అమానవీయ దందా ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై ఢిల్లీ నుంచి జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అధికారులకు మెయిల్ చేయడం చేయడంతోపాటు వీధి కుక్కల రక్తాన్ని తీసి విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై స్పందించిన సైబరాబాద్ మున్సిపల్ అధికారులు విచారణ జరిపారు. ఈ దారుణాలపై 74 పేజీల సమగ్ర నివేదికను అధికారులు సిద్ధం చేసి ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రి యాజమాన్యం వీధి కుక్కలను బంధించి, వాటి నుంచి రెండు, మూడు సార్లు రక్తం తీసేవారని అధికారుల విచారణలో తేలింది. రక్తం తీసిన తర్వాత కొద్దిగా ఆహారం పెట్టి, మళ్లీ రక్తం తీసేవారని, ఇక ఆ కుక్కలో రక్తం లేదని నిర్ధారించుకున్నాక వాటిని శివారు ప్రాంతాల్లో పడేసేవారని అధికారులు గుర్తించారు. పదేండ్లుగా ఈ దందా సాగుతోందని, సమస్యలతో వచ్చే పెట్స్ యజమానులను భయపెట్టి, తప్పనిసరిగా రక్తం ఎక్కించాలని చెప్పి ఒక్కో బ్లడ్ యూనిట్‌కు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. ఇప్పటికే ఆస్పత్రి యజమాని, ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ వెంకటేష్ యాదవ్‌ను పశుసంవర్ధక శాఖ సస్పెండ్ చేసింది.

**మనుషులకు మూగజీవాల రక్తం..!**

ఇదేంటి మేకల రక్తాన్ని మనుషులకు ఎక్కిస్తారా..? అని ఆశ్చర్యపోకండి.. అవును.. అక్రమ సంపాదనకు అలవాటుపడిన బ్లడ్ మాఫియా ఈ తరహా దందాను ఎంచుకున్నది. మేకలు, గొర్రెల రక్తం నుంచి ప్లేట్‌లెట్లను తీసి మనుషులకు ఎక్కిస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. ఇటీవల మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా నాగారంలో వెలుగు చూసిన ఈ ఘటన వైద్యరంగాన్ని ఉలిక్కిపడేలా చేసింది. కీసర పోలీసులు నాగారంలోని చికెన్ షాపులపై దాడులు చేయగా.. 130 ప్యాకెట్ల మేకల రక్తం దొరికింది. ఈ రక్తాన్ని కాచిగూడలోని సీఎన్కే ఇంపోర్ట్స్ అండ్ ఎక్స్‌పోర్స్ సంస్థకు తరలించి.. అక్కడి నుంచి లేబొరేటరీల్లో ప్లేట్‌లెట్ల తయారీకి వినియోగిస్తున్నట్టు విచారణలో గుర్తించారు. ఈ 'గోట్ బ్లడ్ మాఫియా' ఎలాంటి వైద్య ప్రమాణాలు పాటించకుండా మేకలు, గొర్రెల నుంచి అక్రమంగా రక్తం సేకరించి, దాన్ని ప్లేట్‌లెట్ల తయారీకి తరలించడం అప్పట్లో తీవ్ర ఆందోళనకు గురి చేసింది.

**స్వచ్ఛంద సేవ ముసుగులో వ్యాపారం**

పలు బ్లడ్ బ్యాంకుల నిర్వాహకులు అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన రోగులకు హోల్ బ్లడ్ సహా ప్లాస్మా, ప్లేట్లెట్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు నిర్వహించారు. పలు బ్లడ్ బ్యాంకులను గుర్తించి, లైసెన్సులను రద్దు చేశారు. హోల్ బ్లడ్ సహా ప్లాస్మా, ప్లేట్లెట్స్‌ను ఆయా బ్లడ్ బ్యాంకుల సామర్థ్యానికి మించి నిల్వ చేసి, మార్కెట్లో కృత్రిమ కొరతను సృష్టిస్తుండటంతో అధికారులు రంగంలోకి దిగారు. బ్లడ్, ప్లాస్మాను అమ్ముకుంటున్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, న్యూలైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ బ్లడ్ బ్యాంకుల లైసెన్స్‌ను రద్దు చేశారు. మూసాపేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో హీమో సర్వీస్ పేరిట నడుస్తున్న ఓ ల్యాబ్‌లో డీసీఏ అధికారులు ఈ తనిఖీలు చేశారు. డీసీఏ లైసెన్స్ లేకుండా నడిపిస్తున్న ఈ ల్యాబ్ నుంచి తెలంగాణ, కర్నాటక, ఏపీలోని పలు ఫార్మా కంపెనీలు, హాస్పిటళ్లు, రీసెర్చ్ ల్యాబ్స్‌కు రక్తం, ప్లాస్మాను అక్రమంగా విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మియాపూర్ మదీనగూడలోని శ్రీకర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, దారుల్‌షిఫాలోని అబిద్ అలీఖాన్ లయన్స్ ఐ హాస్పిటల్స్‌లో ఉన్న న్యూలైఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ బ్లడ్ సెంటర్ వాళ్లు డోనర్ల నుంచి రక్తాన్ని సేకరించి, ప్లాస్మాఫెరెసిస్ అనే ప్రక్రియ ద్వారా రక్తం నుంచి ప్లాస్మాను వేరు చేసి, హీమో సర్వీసెస్‌కు అమ్ముతున్నట్టు విచారణలో తేలింది. దీంతో ఆ రెండు బ్లడ్ బ్యాంకుల్లో సోదాలు చేసి ప్లాస్మా అమ్మకాలకు సంబంధించిన ఆధారాలను అధకారులు స్వాధీనం చేసుకున్నారు. 2016 నుంచి ఈ దందా జరుగుతోందనీ, లైసెన్స్ రద్దు చేసే నాటికి 6 వేల యూనిట్లకుపైగా ప్లాస్మా యూనిట్లను హీమో సర్వీస్ సేకరించిందని డీసీఏ అధికారులు గుర్తించారు. ఒక్కో యూనిట్ ప్లాస్మాను రూ.700కు కొని, రూ.3,800కు అమ్ముతున్నట్టు గుర్తించారు.

**ఆస్పత్రులు, బ్లడ్ బ్యాంకులపై నిఘా**

ఇటీవల వరుస బ్లడ్ మాఫియా ఘటనలతో నగరంలోని అన్ని ప్రయివేటు పెట్ హాస్పిటల్స్, బ్లడ్ బ్యాంకులపై అధికారులు నిఘా పెట్టారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, డ్రగ్స్ కంట్రోల్, మెడికల్ కౌన్సిల్, వెటర్నరీ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీసులు కలిసి బ్లడ్ బ్యాంకులు, బయోలాజికల్ ఉత్పత్తుల ల్యాబ్స్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని చూస్తున్నట్టు సమాచారం.

# దేశ నైపుణ్య రాజధానిగా తెలంగాణ

**హైదరాబాద్ ,(సిరి న్యూస్):**

"తెలంగాణను దేశ నైపుణ్య రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యువజన, క్రీడల జాబ్ మేళా-2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కొత్త ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా యువతను సిద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



జాబ్ మేళాలో రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు చెందిన యువత భారీగా పాల్గొన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులతో మాట్లాడి ఉద్యోగ అవకాశాలపై అవగాహన పొందారు. నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు.
గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. యువతలో నైపుణ్యాలు పెంపొందితే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని జిల్లాల్లో కూడా ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ మహిళా నేతల డిమాండ్
- మహిళా కమిషన్‌కు వినతిపత్రం
- బాధిత కుటుంబాన్ని వేధిస్తున్నారంటూ ఆరోపణలు
- కేసును నీరుగార్చొద్దని డిమాండ్

**హైదరాబాద్ ,(సిరి న్యూస్):**

మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన నేతలు, ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. బాధితురాలి కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ, దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మహిళా కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. మైనర్ బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, రాజకీయ ప్రభావాలకు లొంగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతుండగా, బీఆర్ఎస్ నాయకులు పలు ప్రాంతాల్లో నిరసనలు నిర్వహిస్తున్నారు. మరోవైపు ఆరోపణలపై బండి సంజయ్ కుటుంబం నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. వినతిపత్రాన్ని స్వీకరించిన మహిళా కమిషన్ అధికారులు విషయాన్ని పరిశీలిస్తామని తెలిపినట్లు సమాచారం.

# రిటైర్డ్ ఐపీఎస్ అధికారి హత్య కేసులో కీలక మలుపు

- ప్రధాన నిందితురాలు కల్పన పూణెలో అరెస్ట్
- నేపాల్ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు పోలీసుల నిర్ధారణ
- దోపిడీ బంగారం ముంబైలో దాచినట్లు గుర్తింపు
- మరిన్ని అరెస్టులపై దృష్టి పెట్టిన పోలీసులు

**హైదరాబాద్ ,(సిరి న్యూస్):**

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య తనూజ రంజన్ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న నేపాలీ పనిమనిషి కల్పన అలియాస్ ధర్మను మహారాష్ట్రలోని పూణెలో పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్యేక బృందాలు ఆమెను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.
ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు హైదరాబాద్, పూణె, ముంబై, ఢిల్లీ, బిహార్ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పట్టుబడిన ఇద్దరు నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా పూణెలో తలదాచుకున్న కల్పనను అదుపులోకి తీసుకున్నారు.
పోలీసుల దర్యాప్తులో ఈ హత్య వెనుక నేపాల్‌కు చెందిన సాహూ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు తేలినట్లు సమాచారం. ఢిల్లీలోని జైలు నుంచే ఈ దోపిడీ, హత్యకు సంబంధించిన పథకం రచించినట్లు గుర్తించారు. ముంబై, నేపాల్, పాట్నా ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో ప్రత్యేక ముఠా ఏర్పాటు చేసినట్లు దర్యాప్తులో బయటపడింది.
హత్య అనంతరం దోపిడీ చేసిన బంగారాన్ని ముంబైలో దాచిపెట్టినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. నిందితుల ఫోన్ సంభాషణలు, ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.
కల్పనను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన అనంతరం ప్రత్యేకంగా విచారించనున్నారు. హత్యకు అసలు కారణాలు, దోపిడీ చేసిన ఆభరణాల తరలింపు, ఇతర నిందితుల పాత్రపై కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.



# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

- ఎంపీ ఈటల రాజేందర్
- ప్రధాని సభ విజయంతో కేడర్‌లో ఉత్సాహం • ప్రజా సమస్యలు పట్టించుకునేది బీజేపీయే

**హైదరాబాద్ ,(సిరి న్యూస్):**

"రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో గెలిచేది బీజేపీయే.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం" అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కావడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.
కంటోన్మెంట్‌లోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఈటల,



ప్రధాని సభకు భారీగా ప్రజలు తరలివచ్చారని తెలిపారు. సభా ప్రాంగణం వెలుపల కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో సభ విజయవంతమైందన్నారు.
రాష్ట్రంలో ప్రజా సమస్యలను నిజంగా పట్టించుకునే ఏకైక పార్టీ బీజేపీయేనని ఈటల వ్యాఖ్యానించారు. తాను 365 రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రధాని మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత దేశవ్యాప్తంగా బీజేపీ మరింత బలపడుతోందన్నారు. తెలంగాణలో అప్పుల సమస్య, రైతులు, విద్యార్థుల ఇబ్బందులకు పరిష్కారం కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.స్వదేశీ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ఈటల గుర్తుచేశారు. "మేక్ ఇన్ ఇండియా", "మేడ్ ఇన్ ఇండియా" లక్ష్యాలతో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని తెలిపారు.
రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేసిన ఈటల, ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు అడిగి తర్వాత విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్ర నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వ పాఠశాలల పురోగతిపై ప్రత్యేక దృష్టి

## విద్య రంగా అభివృద్ధి పై కీలక చర్చలు

## సీఎం ఆదేశాలకు విద్యాశాఖ సిద్ధం




**జిన్నారం మే 11 సిరి న్యూస్**

జిన్నారం మండల విద్యాధికారి విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు మరియు విద్యార్థులతో కలసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మీటింగ్కు సోమవారం హైదరాబాద్ బయలుదేరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహణ. సమావేశానికి విద్యాశాఖ ఉన్నత అధికారులు హాజరవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై చర్చలు జరగనున్నయని తెలిపారు. విద్యార్థులకు డిజిటల్ క్లాసులు, మరియు విద్యాభివృద్ధి పై ఉపాధ్యాయులతో చర్చ జరగనున్నదని తెలిపారు.విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల, కల్పనపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మీటింగ్కు హాజరయ్యారు.

# మై హోమ్ అంకుర ఓట్లను తెల్లాపూర్ డివిజన్ లో కలపాలి

## ఎమ్మార్వో, డిప్యూటీ కమిషనర్ కు బుచ్చి రెడ్డి వినతి

**రామచంద్రపురం, మే 11 (సిరి న్యూస్):**



తెల్లాపూర్‌లోని మై హోమ్ అంకుర నివాస సముదాయానికి చెందిన ఓట్లను తెల్లాపూర్ డివిజన్ పరిధిలోనే కలపాలని కోరుతూ పీఏసీఎస్ అధ్యక్షుడు మల్లేపల్లి బుచ్చి రెడ్డి అధికారులకు వినతిపత్రం అందజేశారు.ప్రస్తుతం మై హోమ్ అంకురకు చెందిన ఓటర్లు 412, 413 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉండగా, ఆ బూత్‌లు భారతి నగర్ డివిజన్‌లోకి వెళ్లాయని తెలిపారు. అయితే మై హోమ్ అంకుర ప్రాంతం భౌగోళికంగా తెల్లాపూర్ డివిజన్ పరిధిలోనే ఉండటంతో, అక్కడి ఓట్లను కూడా తెల్లాపూర్ డివిజన్‌లోనే చేర్చాలని కోరారు.ఈ మేరకు రామచంద్రపురం ఎమ్మార్వో గారికి, పటాన్చెరు డిప్యూటీ కమిషనర్ గార్లకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు పరిపాలనా సౌలభ్యం, ఎన్నికల నిర్వహణలో స్పష్టత కోసం ఈ మార్పు అవసరమని ఆయన పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సదాశివపేట. మే 11. (సిరి న్యూస్)**



సదాశివపేటలోని 9వ వార్డులో ఇందిరమ్మ ఇండ్లను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ పేదవారి సొంతింటి కలను నిజం చేయడమే తమ కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. వార్డు కౌన్సిలర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ 9వ వార్డులో ప్రజలు చాలా నిరుపేదవారు అని, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మరియు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతో వార్డులో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను వార్డులో ప్రజలకు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, కౌన్సిలర్లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీకి పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లాలో 27 కేంద్రాలు.. హాజరుకానున్న 13,862 మంది విద్యార్థులు

## కేంద్రాల వద్ద 144 సెక్షన్..

## జిరాక్స్ సెంటర్ల మూసివేతకు ఉత్తర్వులు

## కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం

**సంగారెడ్డి, మే 11 (సిరి న్యూస్):**



జిల్లాలో ఈ నెల 13 నుండి 21 వరకు జరిగే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 27 కేంద్రాల్లో 13,862 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం ఫస్ట్ ఇయర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ సెషన్లు ఉంటాయని వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య శాఖను, నిరంతర విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని, విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని కలెక్టర్ హెచ్చరించారు.

# ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- ఆహ్వానించి, అవమానించడం
- కాంగ్రెస్కు అలవాటే...
- భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ తీరు మార్చుకోవాలి.
- లేకుంటే ఉద్యమం తప్పదు.
- కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్కే హైమద్..

**రామాయంపేట, మే 11 (సిరి న్యూస్)**



రామాయంపేట పట్టణంలో అభివృద్ధి పథకాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమంలో ఒకవైపు అధికార పార్టీ నాయకుడు, మరో వైపు మున్సిపల్ అధికారులు ప్రోటోకాల్ ను పాటించడం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్ కే అహ్మద్ విమర్శించారు.పదవ వార్డు కౌన్సిల ర్ మద్దెల మాధవి లేకుండానే ఇటీవల ఆ వార్డులో డెవలప్మెంట్ కార్యక్రమాలు చేశారని తెలిపారు.వార్డులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసే విషయంలో అధికార పక్షం ప్రోటోకాల్ పాటించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రామాయంపేట మున్సిపల్ లోని పదవ వార్డులో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్,చైర్పర్సన్ లు కొబ్బరికాయ కొట్టారన్నారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని సమాచారం ఇచ్చి సాయంత్రం ఐదు గంటలకు ఎమ్మెల్యే చే ప్రోగ్రాం చేశారన్నారు.కేవలం ఐదు నిమిషాల ముందు ఫోన్ సమాచారం ఇవ్వటంతో.. అ వార్డు కౌన్సిలర్ మద్దెల మాధవి వెళ్లలేకపోయారని తెలిపారు. అయినా కూడా తమ పార్టీకి చెందిన కౌన్సిలర్ మాధవి వెళ్లేసరికే ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి వెనుదిరిగాడన్నారు.ఒక కౌన్సిలర్ గా తన వార్డులో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఇలా పిలిచి అవమానించడం ఏంటని మద్దెల మాధవి ప్రశ్నించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దోమకొండ యాదగిరి, దోమకొండ వంశీ, అల్లాడి వెంకటి,వినయ్ సాగర్, ఆసన్నోద్దీన్, డాకి పునీత్, సందీప్ గౌడు తదితరులు పాల్గొన్నారు

# వేసవి శిబిరాలు విద్యార్థులకు వరాలు

- ఆటపాటలతో నేర్చుకుందాం వేసవిని ఆస్వాదిద్దాం
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి

**జిన్నారం మే 11 సిరి న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.చంద్రారెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం డివిజన్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎంపిక చేసిన పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి మే 25 వరకు వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు .ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నాలుగో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు తమలోని వివిధ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు వేసవి శిబిరం ఒక వేదికగా నిలుస్తుంది అన్నారు. ముఖ్యంగా డాన్స్, మ్యూజిక్ గేమ్స్, ఆర్ట్ అండ్ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, క్రియేటివిటీ అంశాలలో మెలకువలను తెలుసుకొని రాణించేందుకు ఎంతో ఆస్కారం ఉందన్నారు.వ్యాయామం శారీరక దృఢత్వం కోసం యోగా ధ్యానం మరియు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుంది. సమయ పాలన సెలవుల్లో టీవీలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి సమయాన్ని అర్థవంతంగా గడపడం నేర్చుకోవాలి.ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంఈఓ విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ గోపాలమ్మ, నాయకులు రాజగోపాల్, హెచ్ఎం మంగీలాల్, యువజన నాయకులు అబ్దుల్ బషీర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అనిల్ కుమార్, రామచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, శిక్షకులు పాల్గొన్నారు.




# ఫోక్సో కేస్ లో బండి తనయుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

- మంత్రి పదవికి సంజయ్ రాజీనామా చేయాలి..
- తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి

**జోగిపేట, మే 11, (సిరి న్యూస్):**




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ పోలీస్‌లను తన చేతిలో బందీలుగా చేసుకుని ఉన్నోడికి ఒక విధంగా, లేనోడికి మరొక విధంగా ప్రవర్తిస్తున్నారని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు విషయంలో రాష్ట్ర పోలీసుల పనితీరుపై విస్మయం వ్యక్తం చేస్తూ బీజేపీ కాంగ్రెస్ కుమ్మక్కు అయ్యారన్నారు. సామాన్యుడిపై చిన్న కేసు నమోదైతే గంటల్లో అరెస్టు చేసే పోలీసులు, కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో వంటి అత్యంత కఠినమైన కేసు నమోదై మూడు రోజులవుతున్నా ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని భిక్షపతి ప్రశ్నించారు. ఢిల్లీలో కుస్తీ పడుతున్నట్లు నటిస్తూ, గల్లీలో అక్రమాలను కాపాడుకుంటూ దోస్తీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డితో జరిపిన చీకటి ఒప్పందాలను త్వరలోనే ప్రజల ముందు బట్టబయలు చేస్తామని ఆయన హెచ్చరించారు. మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగిన కేసులో 'హనీ ట్రాప్' అనే పదాన్ని తీసుకురావడం బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ఆక్షేపించారు. 18 ఏళ్ల లోపు బాలికల విషయంలో అటువంటి ఆరోపణలు చెల్లవని తెలిసినా, అధికార బలంతో కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బాధితురాలి తల్లిదండ్రులను బండి సంజయ్ స్వయంగా భయభ్రాంతులకు గురిచేస్తూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, అందుకే ఎఫ్ఐఆర్‌లో మంత్రి పేరును కూడా చేర్చాలని డిమాండ్ చేశారు.

# విభేదాలు వీడి వికాసం వైపు బొల్లారం అడుగులు

- ఒకే రోజు 19 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- బొల్లారం రూపురేఖలు మార్చేస్తాం ఎమ్మెల్యే ధీమా

**జిన్నారం మే 11 సిరి న్యూస్**



బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తి, గాంధీ నగర్, ఐడిఎ కాలనీ, కె.బి.ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్, శ్రీ రామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో 19 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, సిఐ రవీందర్ రెడ్డి, ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా





**రామాయంపేట, మే 11 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా సోమవారం ప్రారంభించారు. గ్రామ పెద్ద చెరువులో చేపట్టిన పూడికతీత పనులకు ఆమె శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించడం, ఆర్థిక భరోసా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. చెరువులో నుంచి వెలువడుతున్న నల్ల మట్టిని రైతులు తమ పంట పొలాలకు తరలించుకొని భూమి సారాన్ని పెంచుకోవాలని కోరారు.చెరువుల పూడికతీతతో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి సమస్య తగ్గుతుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ కలిసి సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ గొల్ల శ్రీశైలం, వార్డు సభ్యులు మల్లారెడ్డి, బాబు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# పక్కాగా జనగణన.!

- సమగ్ర,ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకం
- జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వామ్యులు కావాలి
- పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి . రాందాస్ చౌరస్తా వరకు మారథాన్ వాక్
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**మెదక్ మే,11(సిరిన్యూస్)**

జనగణన 2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా నుండి పోస్ట్ ఆఫీస్ సర్కిల్ వరకు మొదటి దశ జనగణనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలోకలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి మారథాన్ వాక్ కార్యక్రమాన్ని పాల్గొని ఇంటింటి సందర్శనతో అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతో కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం జనగణన ట్యాబ్లు ఆవిష్కరించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...**


చాలా సంవత్సరాల తర్వాత భారత దేశంలో జనగణన చేయడం జరుగుతుందని, 2021లో జనగణన జరగాల్సి ఉండగా కోవిడ్ కారణంగా జరగలేదని, స్వాతంత్రం వచ్చినప్పటి నుండి చేస్తున్న జనగణన ఇది16వసారి అని తెలిపారు.మన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఇది మొదటి జనగణన అని, మొదటి సారి డిజిటల్ విధానంలో ఈ జనగణన నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కుటుంబ వివరాలను స్వయంగా మీరే నమోదు చేసుకునే అవకాశం స్వీయ గణన ద్వారా కల్పించారని, ఇందులో 34 ప్రశ్నలు ఉన్నాయని, కేవలం ఐదు నిమిషాల్లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. సోమవారం నుండి జనగణన ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించడం జరుగుతుందని, అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందని వెల్లడించారు.వారికి ప్రత్యేక ఐడీ కార్డులు కూడా జారీ చేశామని, ఇంటికి వచ్చినప్పుడు వారికి సహకరించాలని కోరారు.జనగణన పేరుతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు మీ ఇంటికి వచ్చి వివరాలు అడిగే అవకాశం ఉంటుందని, అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. జనగణనలో పాల్గొనే సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డుల మీద క్యూ ఆర్ కోడ్ ఉంటుందని, దానిని స్కాన్ చేస్తే అధికారిక వెబ్ సైట్ లో పొంది ఉంచిన వారి పూర్తి వివరాలు వస్తాయని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజు, మెదక్ ఆర్డీవో రమాదేవి, డీఎఫ్ఓ జోజి, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు క్రీడాభిమానులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# భగీరథ్ కేసులో స్పెషల్ సిట్

- కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు
- పోక్సో కేసుపై తెలంగాణ ప్రభుత్వ కీలక నిర్ణయం
- రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతున్న బండి భగీరథ్ వ్యవహారం
- కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా కీలక కోణాల్లో విచారణ
- సెల్‌ఫోన్లు, సోషల్ మీడియా చాట్‌లు, డిజిటల్ ఆధారాలపై ఫోకస్
- కేసును ప్రభావితం చేసే ప్రయత్నాలపై ప్రత్యేక నిఘా
- అవసరమైతే మరిన్ని వ్యక్తులకు నోటీసులు జారీ చేసే అవకాశం
- మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాల నుంచి తీవ్ర స్పందన
- "బాధితురాలికి న్యాయం చేయాలి" అంటూ విపక్షాల డిమాండ్
- బీజేపీ – కాంగ్రెస్ – బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఆరోపణల యుద్ధం
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన



**పోక్సో కేసు**

- దర్యాప్తు నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్న సిట్
- ఎవరైనా ప్రభావశీలులు ఉన్నా వదిలిపెట్టబోమన్న సంకేతాలు
- పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వ్యవహారం


**తెలంగాణ క్రైం బ్యూరో(సిరి న్యూస్)**

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేపుతోంది. కేసు రోజురోజుకు కొత్త మలుపులు తిరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక బృందం కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమగ్రంగా విచారించనున్నట్లు సమాచారం. బాధితురాలి వాంగ్మూలంతో పాటు, ఇప్పటికే సేకరించిన డిజిటల్ ఆధారాలు, సెల్‌ఫోన్ డేటా, కాల్ రికార్డులు, సోషల్ మీడియా చాట్‌లు, వీడియోలు, ఫొటోలు తదితర అంశాలను సిట్ పరిశీలించనుంది. కేసులో ఎవరి పాత్ర ఉన్నా కఠిన చర్యలు తప్పవని అధికార వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి.ఇప్పటికే ఈ వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార పార్టీ నేతలు చట్టం ముందు అందరూ సమానమేనని చెబుతుండగా, బీజేపీ నేతలు మాత్రం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేసును ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు బాధితురాలికి న్యాయం జరగాలంటే పారదర్శక దర్యాప్తు తప్పనిసరి అని డిమాండ్ చేస్తున్నారు. దీంతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.సిట్ ఏర్పాటు నేపథ్యంలో పోలీసులు కేసు విచారణను మరింత వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. కేసుకు సంబంధించిన వ్యక్తులను విడతలవారీగా విచారించే అవకాశం ఉందని సమాచారం. అవసరమైతే మరికొందరికి నోటీసులు జారీ చేయడంతో పాటు అదనపు అరెస్టులు కూడా జరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.కేసు దర్యాప్తులో ఎలాంటి లోపాలు లేకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు సమాచారం. బాధితురాలిపై ఒత్తిళ్లు లేదా బెదిరింపులు లేకుండా భద్రతా చర్యలు కూడా పెంచినట్లు తెలుస్తోంది. కేసును ప్రభావితం చేసేలా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న ఖాతాలపై కూడా పోలీసులు నిఘా పెట్టినట్లు సమాచారం.ఇక మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు ఈ వ్యవహారంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**"బాధితురాలికి పూర్తి న్యాయం చేయాలి",**

"నిందితులు ఎంత ప్రభావశీలులైనా వదిలిపెట్టకూడదు" అంటూ నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మహిళా సంఘాలు ఆందోళనలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ఈ కేసు రాజకీయంగానే కాక సామాజికంగానూ చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారం భారీ చర్చకు దారితీసింది. పలు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు కూడా స్పందిస్తూ బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతున్నారు.మరోవైపు ప్రత్యేక దర్యాప్తు బృందం త్వరలోనే ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉందని సమాచారం. కేసులో కీలక ఆధారాలు లభిస్తే విచారణ మరింత విస్తరించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో బండి భగీరథ్ పోక్సో కేసు తెలంగాణ రాజకీయాల్లో మరింత సంచలనంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.





## ఫీడర్ నాలా మాయం

**చెరువుకు నీరు చేరే దారిలో అక్రమ రోడ్డు**
**అలుగు కాలువపై మట్టి పోసి పైపులు ఏర్పాటు**
**అధికారుల మౌనం రైతుల ఆందోళన**



**జిన్నారం మే 11 సిరి న్యూస్**

జిన్నారం మండలం మాదారం గ్రామ ఎస్ఎన్ కుంట ఆలుగు, కాలువ పై రహదారి నిర్మాణం చేపట్టారు.కాలువకు మట్టి పోసి పైపులు వేసి రోడ్డుగా మార్చారు.గ్రామ సమీపంలో ఉన్న ఎస్ ఎన్ కుంట నిండడంతో కింది చెరువు కు నీటిని సరఫరా చేసే ఫీడర్ నాలా ఆ ప్రాంత సాగునీటి వ్యవస్థకు గుండెకాయ వంటిది. ఆలుగు,కాలువ ద్వారా బామన్ చెరువులోకి నీరు ప్రవహిస్తుంది. ఈ నాలా ద్వారానే కింది చెరువు నిండి,దాని కింద ఉన్న వందలాది ఎకరాల పొలాలకు సాగునీరు అందుతుంది.ఫీడర్ ఛానల్ కనుమరుగు ఒక్కప్పుడు నీటి ప్రవాహంతో కలకలలాడే నాలా ఇప్పుడు వాహనాలు తిరిగే రోడ్డుగా మారి తన ఉనికిని కోల్పోయింది.వరద ముప్పు, వర్షాకాలంలో కాలువ నిండినప్పుడు పైపుల గుండా నీరు వెళ్లకుండ చుట్టుపక్కల పొలాలు మునిగిపోయే ప్రమాదం ఉంది. పూడిక సమస్య కాలక్రమమైన పైపులలో మట్టి చెత్త పేరుకుపోతే నీటి ప్రభావం పూర్తిగా ఆగిపోతుంది.నీటిని శుభ్రం చేయడం చాలా కష్టంగా మారనుంది.సహజ సిద్ధమైన కాలువను మూసివేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉంటుంది. నాలా పునరుద్ధరణ తక్షణమే రెవెన్యూ మరియు ఇరిగేషన్ అధికారులు స్పందించి అక్రమంగా వేసిన రోడ్డును తొలగించి నాలాను యధాస్థితికి తీసుకురావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## జనగణన కు సహకరించాలి

**వెల్దుర్తి మండల తహసిల్దార్ శ్రీనివాస్**





**వెల్దుర్తి, మే 11, (సిరి న్యూస్)**

భారత ప్రభుత్వం చేపట్టిన 2026-27 జనగణన ప్రక్రియలో మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణనా, ఇండ్ల జాబితా తయారు చేయుటకు వెల్దుర్తి మండల పరిధిలోని అన్ని గ్రామాల గ్రామస్తులు ఎన్యూమరేటర్ల కు సహకరించి సరైన వివరాలు అందించాలని తహసిల్దార్ శ్రీనివాస్ కోరారు.సోమవారం ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు మొదటి విడతగా గృహాల లెక్కింపు జరుగుతుందని,పూర్తిస్థాయి జనాభా గణన 2027 ఫిబ్రవరిలో ఉంటుందని తెలిపారు. వివరాలు సేకరించడం ప్రభుత్వ పథకాలు కోత పడతాయ నే అపోహలు నమ్మవద్దని,ప్రజల స్థితిగతుల కోసమే ఈ లెక్కింపు అని స్పష్టం చేశారు. మొదటి వెల్దుర్తి మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో, 23 గ్రామ పంచాయతీల పరిధిలో 52 మంది ఎన్యుమరటర్లు,9 మంది సూపర్వైజర్లు డాటాని సేకరిస్తున్నారు.అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎన్యూమరటర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలతో సమావేశం

**గ్లూకోజ్ ప్యాకెట్లు పంపిణీ.**



**రామాయంపేట,మే 11 (సిరి న్యూస్ )**

రామాయంపేట మండలం జాన్సీ లింగాపూర్ గ్రామంలో సోమవారం నాడు ఉపాధి హామీ పనిలో భాగంగా సోషల్ ఆడిట్ డి ఆర్ పి రమ్య ఉపాధి కూలీలతో మాట్లాడి, పనిలో భాగంగా మాస్టర్స్ గురించి తెలపడం జరిగింది. కూలీలకు రోజువారీ వేతనాల గురించి మరియు పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అటెండెన్స్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఉపాధి కూలీలలో ఎలాంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జాన్సీ లింగాపూర్ గ్రామ ★సర్పంచ్ రామకృష్ణయ్య,ఉప సర్పంచ్ మహేష్,మరియు పంచాయతీ కార్యదర్శి పద్మ పాల్గొని కూలీలకు గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేశారు. అదేవిధంగా కూలీలకు ప్రతిరోజూ మంచినీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కూలీలు చేసిన పనికి నిబంధనల ప్రకారం సకాలంలో డబ్బులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని వారు తెలియజేశారు.

# పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

- బండి సంజయ్ కుమార్ రాజీనామా చేయాలి: ఆదర్శ్ రెడ్డి
- బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్

**రామచంద్రపురం, మే 11 (సిరి న్యూస్):**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు వ్యవహారంపై పటాన్‌చెరు నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నప్పటికీ కేసు నమోదై 48 గంటలు గడిచినా నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం దారుణమని మండిపడ్డారు.పోక్సో చట్టం ప్రకారం ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి ఉండగా పోలీసులు కావాలనే ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పటికీ గంటల తరబడి వేచి ఉంచి కేవలం అక్నాలెడ్జ్‌మెంట్ ఇచ్చి పంపించడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుమార్ పదవిలో కొనసాగితే కేసు దర్యాప్తు నిష్పక్ష పాతంగా జరగదని, వెంటనే ఆయన రాజీనామా చేయాలని లేదా ప్రధాని ఆయనను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఒత్తిడి తెచ్చి కేసును వెనక్కి తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడిన వారిని కూడా సహ నిందితులుగా చేర్చాలని కోరారు.బాధిత బాలికకు, ఆమె కుటుంబానికి తక్షణ రక్షణ కల్పించి మెజిస్ట్రేట్ ముందు 164 స్టేట్‌మెంట్ నమోదు చేయాలని అన్నారు. కేసులో నిందితుడికి సులభంగా బెయిల్ వచ్చే సెక్షన్లు కాకుండా కఠినమైన పోక్సో సెక్షన్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.గతంలో ఇతర ఘటనల్లో కఠిన చర్యలు కోరిన బండి సంజయ్ కుమార్ ఇప్పుడు తన కుమారుడి విషయంలో మాత్రం మౌనం వహించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆదర్శ్ రెడ్డి విమర్శించారు. ఆడబిడ్డకు న్యాయం జరిగే వరకు బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# హెచ్ పి.వి వాక్సిన్ పై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మే 11 (సిరి న్యూస్):**





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్ పి.వి వాక్సిన్ పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాల్లో హెచ్ .పి.వి వాక్సిన్ పై, ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలపై, సి ఎస్ ఆర్ నిధులపై, ఉపాధి హామీ పథకం, జనగణన పై, సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 14 నుంచి 15 మధ్య వయస్సు గల బాలికలందరికి హెచ్ . పి .వి వ్యాక్సిన్ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వ్యాక్సిన్ పై ముందుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాక్సిన్ వల్ల ఉపయోగాలను వివరించాలన్నారు. ఈనెల 13 నుంచి 21 వరకు జరిగే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీక్షలను ప్రశాంత వాతావరణంలో రాయడానికి కావలసిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. పరిశ్రమలు సి ఎస్ ఆర్ నిధులను సమాజ హితం కోసం అందించాలని పిలుపునిచ్చారు. ఐటిఐ, డిప్లమా, పాలిటెక్నిక్ విద్యార్థులు నేషనల్ అప్రెంటిషిప్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ కార్మికుల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వందరోజుల పని కల్పించి ఉపాధి కల్పించాలన్నారు. జనగణన లో ప్రజలందరి భాగస్వామ్యం చేయాలన్నారు.ఈరోజు నుంచి హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, దానిని సక్రమంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , జెడ్పిసిఇఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారిని మాధురి, మెడికల్ సూపరిండెంట్ సునీత దేవి, డి సి హెచ్ శివ దయాల్, తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, మే 11 (సిరి న్యూస్ ):**



వెల్దుర్తి మండలం లోని అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చిన రైతులు ఆందోళనకు గురికావద్దని, రైతులు తీసుకువచ్చిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి భరోసా ఇచ్చారు. వెల్దుర్తి మండలం చెట్టుపల్లి లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జిపిఎస్ సిస్టంతో ధాన్యం కొనుగోలు వారం రోజులు ఆలస్యం అయినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని కొనుగోలు కేంద్రాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ తూకం వేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, నిబంధన మేరకే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి లారీలను పంపించాలని కలెక్టర్ ను కోరారు. కొనుగోలు చేసిన ధాన్యం తీసుకోకుండా మిల్లర్లు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. అంతేకాకుండా ఐకెపి ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రాములో ధాన్యం పోయటానికి సంబంధించిన భూమి లేకపోవడంతో ఈ విషయమై ఐకెపి సభ్యురాలు వినతి పత్రం అందజేయగా త్వరలోనే మంత్రితో ఈ విషయం చర్చించి స్థలం సేకరణకు తగు చర్యలు చేపడతామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు ముక్తాబాయ్, మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, తలారి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం

- నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి మే 11,( సిరి న్యూస్):**



వెల్దుర్తి మండలంలోని రామయపల్లి, చెట్టుపల్లి, గ్రామలలో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని,అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యమని తెలిపారు.గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయని అసలైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కూడా అవుతున్నాయని, దీంట్లో ఎటువంటి అవకతవకలకు తావు లేదని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, మండల మండల పార్టీ అధ్యక్షుడు మహేష్ రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు ముక్తాబాయ్ చెట్టుపల్లి గ్రామ సర్పంచ్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ ఉప సర్పంచ్

**వెల్దుర్తి, మే 11, (సిరి న్యూస్):**




వెల్దుర్తి లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి లో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి, వారి ప్రతిభను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి నందు వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబయ్య , గ్రామ సర్పంచ్ అదర్శ్, గ్రామ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, వార్డు సభ్యులు మహేందర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమాన్ని ప్రార్థన గీతం తో ప్రారంభించిన, అనంతరం ప్రధానోపాధ్యాయులు సాంబయ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, విద్యార్థులు తమలోని కళలు, క్రీడలు, విజ్ఞానశక్తి మరియు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవడానికి ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ వేసవి శిబిరంలో చిత్రలేఖనం, యోగా, క్రీడలు, సంగీతం, నృత్యం,ఆర్ట్ & క్రాఫ్ట్ చేతిపనులు వంటి అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, శిక్షకులు విద్యార్థులకు శిక్షణ అందిస్తూ, ప్రతి విద్యార్థి ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.విద్యార్థులు కూడా ఈ శిబిరం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, ఖదీర్, విజయ్ మోహన్, అమూల్య,అర్చన, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సృజన ,సిఆర్పీ రాజు, జూ. ఆసిస్టెంట్ మల్లేష్, సాబెర్ పాల్గొనడం జరిగింది.



# కాలనీ అభివృద్ధికి తోడ్పడుతా

## టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.



**సదాశివపేట. మే 11. (సిరిన్యూస్)**

సదాశివపేట పట్టణంలోని 6వ వార్డులో సీసీ రోడ్డు పనులను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ టియుఎఫ్ఐడిసి నిధులు 30 లక్షల రూపాయలతో పట్టణంలోని 26 వార్డులలో అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. నేడు 6వ వార్డులో సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 6వ వార్డు కౌన్సిలర్ నాగుల మానెమ్మ మాట్లాడుతూ మా వార్డు అతిపెద్ద వార్డు అని, అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని, 6వ వార్డు అభివృద్ధికి సహకరించాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డికి కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనాభా లెక్కల సేకరణకు సహకరించాలి

## తహసీల్దార్ సరస్వతి

## జూన్ 9 వరకు తొలి విడత ప్రక్రియ

## ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించనున్న సిబ్బంది

**రామచంద్రపురం, మే 11 (సిరి న్యూస్):**



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన జనాభా లెక్కల సేకరణ ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని రామచంద్రపురం తహసీల్దార్ సరస్వతి కోరారు. మే 11 నుంచి జూన్ 9 వరకు తొలి విడత గణన కొనసాగుతుందని తెలిపారు.ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ వివరాలను సేకరిస్తారని చెప్పారు. ప్రజలు అందించే సమాచారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఖచ్చితమైన వివరాలు అందించాలని సూచించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలంతా సిబ్బందికి సహకరించి జనాభా గణన విజయవంతం చేయాలని తహసీల్దార్ సరస్వతి విజ్ఞప్తి చేశారు.

# సమస్యల పరిష్కారమే ప్రజావాణి




**మెదక్మే,11(సిరిన్యూస్)**

ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం చూపాలని,బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల లక్ష్యం అని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు.మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి వినిపించారు.ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో ఎస్పీ స్వయంగా మాట్లాడి సమస్యల వివరాలు తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు,ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో ఫోన్‌లో మాట్లాడి వేగంగా స్పందించాలని సూచించారు.ప్రజలకు న్యాయం చేయడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుందని ఎస్పీ తెలిపారు. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు.చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం అందిస్తామని పేర్కొన్నారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరుగుతోందని ఎస్పీ తెలిపారు.

# స్వయం ఉపాధితో ఎదగాలి.

## టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.



**సదాశివపేట. మే 11.(సిరి న్యూస్)**

సదాశివపేటలోని నిజాంపూర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చిలుకూరి నరేందర్ శ్రీ లక్ష్మీ ఫిల్లింగ్ స్టేషన్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపును ప్రారంభించిన టి.జి.ఐ.ఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ సొంత ఉపాధినీ ఎన్నుకుంటూ వ్యాపార రంగంలో మరింతగా రాణించినట్లయితే ఇతరులకు నిరుద్యోగ్యస్థులకు ఉపాధిని కల్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడీల రామ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజుగౌడ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పైసా ఖర్చు లేకుండా మెరిసే జుట్టు సొంతం



**మన సౌందర్యాన్ని పెంచేది ఏదైనా ఉంది అంటే వాటిలో ముందు ఉండేది జుట్టు. వత్తయిన, నల్లని, సిల్కీ స్మూత్ హెయిర్ ఉంటే మనల్ని ఎంతో ఎట్రాక్టివ్‌గా మారుస్తుంది. కానీ ఇప్పుడున్న పొల్యూషన్, ఆహారపు అలవాట్లు మన జుట్టు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంటుంది. దీని వల్ల సిల్కీ స్మూత్ హెయిర్ కోసం యువత ఆపసోపాలు పడుతుంటారు. అయితే అందుకోసం వేల రూపాయాలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా ప్రస్తుతం యువతలో కనిపిస్తున్న ప్రధాన సమస్య జుట్టు రాలడం. జుట్టు రాలడాన్ని నివారించడానికి మార్కెట్లో అనేక రకాల షాంపూలు, సీరమ్‌లు, నూనెలు, మందులు అందుబాటులో ఉన్నాయి. వాటిని ఉపయోగించే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. అయితే వాటితో సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండొచ్చు. జుట్టు రాలడానికి డజన్ల కొద్దీ సమస్యలు, కారణాలు ఉన్నాయి. జుట్టు రాలడాన్ని నివారించడానికి, జుట్టు పెరుగుదలను పెంచడానికి సులభమైన మార్గం చూద్దాం.. మన దగ్గర ఉన్న కొన్ని పదార్థాలను ఉపయోగించి జుట్టు పెరుగుదలకు సాయపడవచ్చు. ఉల్లిపాయలు జుట్టు పెరుగుదలకు చాలా మంచి పదార్థం, బియ్యం నీరు జుట్టు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.**

బియ్యంలో ఇనోసిటాల్ అధిక సాంద్రతలో ఉంటుంది. ఇది జుట్టు పెరుగుదలకు అవసరమైన కార్బోహైడ్రేట్, ఇది జుట్టు పెరుగుదలకు సాయపడుతుంది. ఇనోసిటాల్ కంటెంట్ దెబ్బతిన్న జుట్టును మరింత బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది. బియ్యం నీటిలో అమైనో ఆమ్లాలు, విటమిన్లు నిండి ఉంటాయి. ఇది జుట్టును బలోపేతం చేస్తుంది. అవసరమైన పోషకాలను కూడా అందిస్తుంది.

ఉల్లిపాయలో ఉండే సల్ఫర్ కారణంగా కొల్లాజెన్ ఉత్పత్తికి ప్రయోజనకరంగా ఉంటుంది. కొల్లాజెన్ ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఇది జుట్టు పెరుగుదలకు సహాయపడుతుంది. బియ్యం నీరు, ఉల్లిపాయ ఉపయోగించి జుట్టుకు అప్లై చేయగల సులభమైన పేస్ట్ తయారు చేద్దాం. ఇది మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.

ముందుగా ఒక గిన్నెలో బియ్యం తీసుకుని నీరు పోసి నానబెట్టండి. రెండుమూడు గంటల తర్వాత నీళ్ళను వేరు చేయండి. ఈ నీటిలో సగం ఉల్లిపాయను కోసి కలపండి. అలాగే దానికి ఒక అంగుళం తొక్క తీసిన అల్లం వేయండి. ఈ మిశ్రమాన్ని స్టవ్ మీద ఉంచి 5 నిమిషాలు మరిగించాలి. తర్వాత, స్టవ్ ఆఫ్ చేసి, మిశ్రమాన్ని చల్లబరచాలి. ఈ మిశ్రమం చల్లబడిన తర్వాత మిక్సీ జార్ తీసుకొని మెత్తని పేస్ట్ లా రుబ్బుకోవాలి.

ఈ పేస్ట్‌ని మీ తలకు, జుట్టుకు బాగా అప్లై చేసి 30 నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత గోరువెచ్చని నీటితో మీ జుట్టును కడగాలి లేదా స్నానం చేయండి. వారానికి రెండుసార్లు ఇలా చేయండి. ఇది మీ జుట్టు పెరుగుదలకు చాలా సహాయపడుతుంది.

# సీమ సింతకాయతో సప్త ప్రయోజనాలు

**సీమ సింతకాయలు.. చిన్నప్పుడు భలేగా తినేటోళ్లం. కానీ పెద్దయ్యే కొద్దీ మన అలవాట్లూ మారాయి.. వాటిని అమ్మేవారు తగ్గారు. ఇప్పుడు ఏదో అమావాస్యకు పౌర్ణమికి అన్నట్లు ఎప్పుడో ఒకసారి అలా కనిపిస్తుంటాయి. అయితే ఈ సీమ సింతకాయలను చాలా మంది వగరుగా ఉంటాయని ఇష్టపడరు. అవి తినడం అవసరమా అని అడిగేవారూ లేకపోలేదు. కానీ మీకు తెలుసా వీటి వల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ అరుదైన పండు కేవలం రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల విషయంలోనూ అద్భుతమైన నిధి లాంటిది! మీరు కూడా దీన్ని వగరుగా ఉందని పక్కన పెట్టేస్తే ఎన్నో అద్భుతమైన ఆరోగ్య లాభాలను కోల్పోయినట్టే. ఈ చిన్న సీమ చింతకాయతో మీ ఆరోగ్యానికి కలిగే 7 రకాల అద్భుతమైన ప్రయోజనాలు తెలుసుకుంటే మీరు తప్పకుండా ఆశ్చర్యపోతారు. మరెందుకు ఆలస్యంఈ అద్భుతమైన పండు మన శరీరానికి ఎలా మేలు చేస్తుందో చూద్దామా!**

**డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచుతుంది**

సీమ చింతకాయలో యాంటీహైపర్గ్లైసెమిక్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడేవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో ఎంతగానో సహాయపడతాయి. ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ సున్నితత్వం మెరుగుపడుతుంది, ఇది చక్కెరను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి దోహదపడుతుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది**

సీమ చింతకాయలో విటమిన్ సి, శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధిక మొత్తంలో ఉంటాయి. ఈ పోషకాలు మీ రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయి. ఫలితంగా, మీ శరీరం వివిధ రకాల వైరస్‌లు, బ్యాక్టీరియాలతో సమర్థవంతంగా పోరాడి, రోగాల బారిన పడకుండా మిమ్మల్ని రక్షిస్తుంది.

**హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది**

గుండె ఆరోగ్యానికి సీమ చింతకాయ చాలా మేలు చేస్తుంది. ఇందులో ఉండే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా, ఈ పండు రక్తపోటును కూడా సమతుల్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**జీర్ణక్రియను బలపరుస్తుంది**

సీమ చింతకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఫైబర్ మీ జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మలబద్ధకం, అతిసారం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది మీ కడుపులోని వ్యర్థాలను శుభ్రం చేయడంలో, ప్రేగు కదలికలను క్రమబద్ధం చేయడంలో కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**రక్తహీనత నుండి ఉపశమనం**

మీరు రక్తహీనతతో బాధపడుతున్నట్లయితే, సీమ చింతకాయ మీకు మంచి పరిష్కారం. ఈ పండులో ఇనుము (ఐరన్) పుష్కలంగా ఉంటుంది, ఇది శరీరంలో రక్త ఉత్పత్తికి సహాయపడి, రక్తహీనత లక్షణాలను తగ్గించడంలో తోడ్పడుతుంది.

**బరువు తగ్గడంలో సహాయపడుతుంది**

బరువు తగ్గాలనుకునే వారికి సీమ చింతకాయ ఒక మంచి ఎంపిక. ఇందులో ఉండే ఫైబర్ ఆకలిని నియంత్రిస్తుంది, తద్వారా మీరు అధికంగా తినాలనే కోరికను తగ్గిస్తుంది. నిమ్మరసంలో అడవి జలేబీ రసాన్ని కలిపి తాగడం వల్ల బరువు తగ్గడంలో మరింత సహాయం లభిస్తుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**చర్మానికి మంచిది**

సీమ చింతకాయ యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సితో నిండి ఉంటుంది. ఇవి మీ చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించి, దానిని మెరుస్తున్నట్లుగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ పండు చర్మంపై వచ్చే ముడతలు మరియు వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.